ఇద్దరికి వీక్లి బెస్ట్ పర్ఫార్మెన్స్ ప్రశంసా

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

పోలీస్ వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్‌కు ఎంపికయిన కర్నూలు ఒకటవ పట్టణ హెడ్ కానిస్టేబుల్ జెఎండి. రఫీ, కోడుమూరు కానిస్టేబుల్ కెజి.రాజ్‌కుమార్ ను ఎస్‌పి సిద్దార్ధ్ కౌశల్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కర్నూలు ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న 128 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంతో పాటు , మత పెద్దలతో శాంతి యుత సమావేశాలను ఏర్పాటు చేయించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచారు. కోడుమూరు పోలీసుస్టేషన్ పరిధిలోని 48 యుఐ కేసులు, 70 పిటి కేసుల్లో నోటిసులు సర్వ్ చేసినందుకు గాను లోక్ అదాలత్ లో 20 యుఐ కేసులు, 22 పిటీ కేసులు పరిష్కారం కావడానికి అత్యుత్తమ పనితీరును కనబరిచాడు. ఈ సందర్భంగా ఎస్‌పి వారిరువురిని అభినందించారు. ప్రశంసా పత్రం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ జెఎండి.రఫీ, కానిస్టేబుల్ కెజి. రాజ్ కుమార్ జిల్లా ఎస్‌పికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు..?

- సిఎంఒలో బదిలీల ఫైల్ - కర్నూలు జిల్లాలో 20 మందికి పైగా

- అక్రమ బదిలీలు నిలిపివేయాలి - యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నో రోజుల నుండి ఉపాధ్యాయులు మహిళల కోసం ఎదురుచూస్తున్నారు. బదిలీల షెడ్యూలు విడుదల అవుతుందనుకుంటే అంతలోపే అక్రమ బదిలీలకు తెర లేపారు. ఎమ్మెల్యేలు మంత్రులు ఇచ్చిన సిఫార్సుల మేరకు ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టేందుకు త్వరలో ఇతరులు రానినట్లు తెలిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే చేపట్టాలని గత కొన్ని నెలలుగా ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా ఉపాధ్యాయుల బదిలీలపై ఆ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఒకవైపు ఈ వ్యవహారం జరుగుతుంటే మరోవైపున అక్రమంగా ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఆమోదముద్ర పడగానే సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. కర్నూలు జిల్లాలో దాదాపుగా 20 మంది పైగా ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎమ్మెల్యేలు మంత్రుల నుండి సిఫార్సు లేఖలను ప్రభుత్వానికి పంపారు. ఈ బదిలీలను చేపట్టేందుకు ఒక్కో ఉపాధ్యాయుడి నుండి ఎమ్మెల్యేలు రూ.3 నుండి రూ.5 లక్షల వరకు కూడా వసూలు చేసినట్లు సమాచారం. సదరు ఉపాధ్యాయులకు కోరుకున్న స్థానాలకు బదిలీ చేసేందుకు సిఫార్సు లేఖలను ప్రభుత్వానికి ముడుపులు తీసుకొని పంపారు. ఈ బదిలీలను చేపట్టేందుకు గతంలో ప్రభుత్వం సిద్ధమవుగా వెంటనే మీడియాలో రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. మళ్లీ ఇప్పుడు ప్రజా ప్రతినిధులు ఇచ్చిన సిఫార్సు లేఖల ప్రకారం బదిలీలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బదిలీల ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూలును విడుదల చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. కౌన్సిలింగ్ ఆధారంగా బదిలీలను జరపకుండా అక్రమంగా సిఫార్సు లేఖలు పొందిన వారికి చేపట్టడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. అక్రమ బదిలీలను నిలిపివేసి కౌన్సిలింగ్ ఆధారంగా బదిలీలు చేపట్టినందుకు షెడ్యూల్ విడుదల చేయాలని కోరుతున్నాయి. బదిలీలను గతంలో బ్యాన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బ్యాన్‌ను, కౌన్సిలింగ్ నిబంధనలను గాలికి వదిలేసి కాసులకు కక్కుర్తిపడి బదిలీలు చేస్తున్నారు. వీటికి ఏదో ఒకచోట పుల్‌స్టాఫ్ పడాల్సి ఉంది.

బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ఇచ్చిన సిఫార్సు లేఖల ప్రకారం బదిలీలు నిర్వహించేందుకు సన్నద్ధం కావడం దుర్మార్గం. అలాంటి అక్రమ బదిలీలను వెంటనే నిలిపివేసి కౌన్సిలింగ్ ఆధారంగా బదిలీలను చేపట్టాలి.

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తాం

- ప్రిన్సిపల్ ఇందిరా శాంతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి పేర్కొన్నారు. బుధవారం కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఖాళీ స్థలంలో జూనియర్ కళాశాల తరగతులను నిర్మించుకోవచ్చని అన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులు కూడా తమ విద్యార్థులేనని పేర్కొన్నారు. ఇప్పుడు కళాశాలలో ఉన్నల్యాబ్‌లను ఖాళీ చేసి ఇవ్వాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ కళాశాల విద్యా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అక్కడి నుండి అనుమతి రాగానే జూనియర్ కళాశాలకు స్థలం ఇస్తామన్నారు. ఈ విషయంపై వివాదం చేయకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె అభిప్రాయం చేశారు. రెండు కళాశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఇందిరా శాంతి

కెవిపిఎస్ ప్రచార జోరు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభ ఈ నెల 28, 29న కర్నూలులో నిర్వహించనున్న నేపథ్యంలో నగరంలో కెవిపిఎస్ ప్రచారం మొదలైంది. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో ప్రధాన రోడ్లకు ఇరు వైపులా కెవిపిఎస్ చిత్రాలు, జయప్రదం చేయాలన్న పిలుపుతో చిత్రీకరించారు. రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి, కెవిపిఎస్- ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన వంటి చిత్రాలు నగరంలో అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

నేడు తుగ్గలికి ఎస్‌సి కమిషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలికి రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్ గురువారం వస్తున్నట్లు బుధవారం అధికార వర్గాలు వెల్లడించాయి. తుగ్గలి మండల పరిషత్ ఆవరణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వారు తెలిపారు. 2019లో టిడిపి ప్రభుత్వంలో అంబేద్కర్ విగ్రహానికి అప్పటి టిడిపి ఎంపిటిసి వరలక్ష్మి, ఎంపిపి వెంకటేష్, టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాలు భూమి పూజ చేశారు. అప్పటినుండి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. నాలుగు సంవత్సరాల తర్వాత అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్ 11:30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం బహిరంగ సభలో కమిషన్ చైర్మన్ మాట్లాడుతారు. అనంతరం విక్టర్ ప్రసాద్ పత్తికొండకు బయలుదేరి అక్కడ ఎస్‌సి ముఖ్య నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరిశ్రమల్లో భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పరిశ్రమల్లో భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి, అప్రమత్తంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టేట్ స్పెషల్ సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా జిల్లాస్థాయి అధికారాలు పరిశ్రమలను తనిఖీ నిర్వహించాలన్నారు. పర్యావరణం, భద్రత, అగ్ని ప్రమాదాల నివారణకు గాను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో తనిఖీ నిర్వహించి ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలకు ప్రోటోకాల్ ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై తగు సూచనలు చేశారు. పరిశ్రమల చుట్టుపక్కల ఎటువంటి పాఠశాలలు, నివాస స్థలాలు ఉండకూడదన్నారు. ఆ విధంగా ఉన్న పరిశ్రమలపై నివేదిక తయారు చేయాలని పరిశ్రమల శాఖ జిఎంని ఆదేశించారు. ప్రతినిత్యం పరిశ్రమలను తనిఖీ నిర్వహించి మార్క్ డ్రిల్స్ చేయాలన్నారు, చేసిన మార్క్ డ్రిల్స్‌ను వీడియో రూపంలో చిత్రీకరించి పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బందికి చూయించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పరిశ్రమల శాఖ జిఎం మాట్లాడుతూ జిల్లాలో 48 పరిశ్రమలు ఉండగా, వాటిలో 34 తనిఖీ నిర్వహించామని, ఇంకా 14 నిర్వహించాల్సి ఉందని కలెక్టర్‌కు తెలిపారు. పరిశ్రమల శాఖ జిఎం సోమశేఖర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ.నారాయణ రెడ్డి, పరిశ్రమల యాజమానులు పాల్గొన్నారు.

23న మండలి ఓటర్ల ముసాయిదా జాబితా

ఈనెల 23న శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ ముసాయిగా ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు వెల్లడించారు. శాసనమండలి దరఖాస్తుల వివరాలతో పాటు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2023 కి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను కూడా విడుదల చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి 68,391 దరఖాస్తులు రాగా, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి 6681 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుల విచారణ జరుగుతోందనితెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన రోజు నుండి అనగా నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను ఫైల్ చేసుకోవచ్చున్నారు. డిసెంబర్ 30 వ తేదీన ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తుది ప్రచురణ జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

జనరల్ ఓటర్ల వివరాలు :

అనంతరం 2023కు సంబంధించిన జనరల్ ఓటర్ల ముసాయిదా జాబితాను కూడా ఈ సందర్భంగా కలెక్టర్ విడుదల చేశారు. మొత్తం పోలింగ్ స్టేషన్లు 2184 కాగా, 1912049 ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఇందులో 9,51599 పురుషులు, 9,60158 మహిళలు ,ఇతరులు 292 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కర్నూలు 2,56,472, పాణ్యం 29,9662, పత్తికొండ 2,15095, కోడుమూరు 2,23764, ఎమ్మిగనూరు 2,31,559, మంత్రాలయం 1,95,385, ఆదోని 2,45,350, ఆలూరు 2,44,762 ఓటర్లు నమోదు అయ్యారన్నారు. సర్వీస్ ఓటర్లు మొత్తం 1605 మంది ఉండగా ఇందులో పురుషులు 1578 మంది, మహిళలు 27 మంది ఉన్నారన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లు, తహశీల్దార్, ఇఆర్ఒ కార్యాలయాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన చేయడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈరోజు నుండి అనగా నవంబర్ 9 వ తేదీ నుండి డిసెంబర్ 8 వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను ఫైల్ చేసుకోవచ్చున్నారు. ఫామ్ 6 లో కొత్త ఓటర్లు, ఫామ్ 7 లో తొలగింపు, ఫామ్ 8 లో చిరునామా మార్పు, ఇతర కరెక్షన్లు చేసుకోవాలని, అర్హులైన వారు ముఖ్యంగా 18-19 వయసులో ఉన్న యువత కొత్త ఓటర్లు గా నమోదు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. 19, 20 తేదీల్లో నూ, డిసెంబర్ 3,4 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలుగా నిర్వహిస్తున్నామని, ఈ తేదీల్లో పోలింగ్ బూత్ లో బూత్ లెవెల్ అధికారులు ఫామ్ 6, ఫామ్ 7, ఫామ్ 8 అర్జీలను స్వీకరిస్తారన్నారు. డిసెంబర్ 26వ తేదీలోపు క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రచురణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావుతో పాటు ఎన్నికల విభాగం సూపరిండెంట్ మురళి లు ఉన్నారు.

ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సమాజ నిర్మాణానికి పునాది విద్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

సమాజ నిర్మాణానికి పునాది విద్య మాత్రమేనని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని స్థానిక సుంకేసుల రోడ్ సమీపంలోని ఎస్ఎల్ఎన్ గార్డెన్స్ ఆచార్య విద్య సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడారు. విద్యను కష్టంగా భావించకుండా ఇష్టంగా చదవాలన్నారు. విద్య భవిష్యత్తుకు పునాది అని, సమాజ బలహీనతల నుండి సమాజాన్ని రక్షించాలంటే, కేవలం విద్య మాత్రమే మార్గం అన్నారు. విద్య ముఖ్య ఉద్దేశం సమాజ నిర్మాణమని చెప్పారు. గురజాడ అప్పారావు చెప్పినట్లు 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్', దేశం బాగుపడాలంటే పౌరులు లేదా మనుషులు బాగుపడాన్నారు. అప్పుడే సమాజం బాగుపడుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విషయాన్ని ఎంచుకుని అందులో ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎంపి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు డాక్టర్స్ కాలనీ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఫర్ మెన్)ను ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న సమస్యలపై ప్రిన్సిపల్, అధ్యాపకులతో సమక్షించారు. ఎంపి నిధుల కింద మంజూరైన బిల్డింగు పనుల గురించి ఆరా తీశారు. కళాశాలలో సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాలేజీలోకి వెళ్లే రహదారి సమస్య, కళాశాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సిబ్బంది ఎంపి దృష్టికి తెచ్చారు. తప్పకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని, ప్రతి ఒక్క విద్యార్థీ బాగా చదువుకోవాలని అన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర చాలా కీలకమని అన్నారు. డిగ్రీ కళాశాలలో లైబ్రరీ సదుపాయం, మౌళిక సదుపాయాల రూకల్పనకు కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ పి.కళావతి, వైస్‌ప్రిన్సిపల్ నాగన్న, కళాశాల సిబ్బంది, బిసి నాయకులు మధుసూదన్, ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న ఎంపి సంజీవ్‌కుమార్

సమయపాలన పాటించని అధికారులపై చర్యలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం: సమయపాలన పాటించని ఉల్చాల గ్రామ సచివాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ కర్నూలు మండల కార్యదర్శి ప్రకాష్ సంయుక్తంగా కర్నూలు ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్చాల గ్రామంలో గ్రామ సచివాలయం అధికారుల కోసం, గ్రామ ప్రజలు పడిగాపులు కాస్తూ కూర్చునే పరిస్థితి ఉందని అన్నారు. ఉదయం 11గంటల తర్వాత ఆఫీసుకు వస్తున్నారని, ఇదేమిటని ప్రజలు అడిగితే ఎప్పుడు వస్తే ఏమి మీపని జరుగుతుందా లేదా అని దురుసుగా సమాధానం ఇస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టిందని, అవన్నీ ప్రజల దగ్గరకు చేరాలంటే గ్రామ సచివాలయాల తీరు మెరుగ్గా ఉండాలన్నారు. 11,12 గంటలకు వస్తే ఎలా సేవలు అందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా పని తీరు మార్చుకొని, సమయపాలనకు వచ్చి, ప్రజలకు సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని,ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, రాఘవేంద్ర

సంక్షేమ పథకాలు వివరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జగన్ పాలన జనరంజకం : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించి సీఎం జగన్మోహన్ రెడ్డి జన రంజకమైన పాలన సాగిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 34 వ వార్డు 88వ సచివాలయంలోని కాటసాని శివ నరసింహ రెడ్డి నగర్, గీతానగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్లు ఎరుకల వెంకటేశ్వర్లు, గాజుల శ్వేతారెడ్డి, సాపురు మాధురి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, కాశపోగు జయరాముడు, నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, కల్లూరు జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, పెద్దపాడు మాజీ సర్పంచి శ్రీదర్ రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోలు గోపాల్ రెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంత రెడ్డి, సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

15 వరకు ఇకెవైసి గడువు పెంపు

ప్రజాశక్తి-సి బెళగల్

ఇకెవైసి చేసుకోవడానికి ఈనెల 15 వరకు ప్రభుత్వం గడువు పెంచిందని పిఎం కిసాన్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ మల్లేష్ కుమార్ సూచించారు. ఇందులోనే బ్రాహ్మణ దొడ్డిలో రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరును, ఆయా రైతుల రికార్డులను పరిశీలించారు. ఇకెవైసికి ప్రభుత్వం గడువు పెంచడం నాలుగో సారి అని రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజు, రాధిక, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో ఫైళ్లను పరిశీలిస్తున్న ఎఒ మల్లేష్

8 ఏళ్ల బాలుడికి అరుదైన గుండె చికిత్స

3 సార్లు గుండె ఆగిపోయినా ప్రాణాలను కాపాడిన మెడికవర్ హాస్పిటల్ వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : తెలంగాణ రాష్ట్ర గద్వాలకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడిని అరుదైన గుండె చికిత్స చేసి మూడు సార్లు గుండె ఆగిపోయినా బాలుడి ప్రాణాలను మెడికవర్ హాస్పిటల్ వైద్యులు కాపాడారు. హాస్పిటల్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సిస్ట్, పీడియాట్రిషన్ విభాగం డాక్టర్ ఆర్.మురార్జీ తెలిపిన వివరాల ప్రకారం... .గద్వాలకు చెందిన బాలుడె వరుణ్‌ను శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడటం వలన మెడికవర్ క్రిటికల్ కేర్ విభాగానికి తీసుకొచ్చారు. ఆ సమయానికి కార్డియక్ అరెస్ట్ వచ్చింది. ఎంతో శ్రమించి ఆసుపత్రి వైద్యులు గుండెను పునః ప్రారంభిచారు. బాబు గుండెకు ఇన్‌ఫెక్షన్ సోకి గుండె పని చేయు సామర్థ్యత తీవ్రంగా మందగించింది. దీంతో పలుమార్లు గుండె ఆగిపోయింది. వైద్యులు ఎంతో శ్రమించి గుండెను తిరిగి పని చేసేలా చేశారు. బాబును ఐసియూలో వెంటిలేటర్ మీద ఉంచటంతో పాటు అత్యాధునిక మందులతో వైద్యం చేశారు. ఇలాంటి పరిస్థితులలో గుండె నిలిచి పోయినపుడు మెదడుకు రక్త సరఫరాలో ఇబ్బంది తలెత్తి పక్షవాతం వచ్చే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. డాక్టర్ల బందం , నర్సింగ్ స్టాఫ్ కృషితో బాబు ను అనుక్షణం కంటికి రెప్పగా కాపాడుకోవటం వల్ల మెదడుకు ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదు. ఇలా పిల్లల గుండెకు ఇన్‌ఫెక్షన్ సోకి గుండె పని తీరు మందగించటం చాలా అరుదుగా వస్తుంది. దీని వైద్య పరిభాషలో మయోకార్డియారెస్ట్ అంటారు. దీనికి అనేక రకాల వైరసులు కారణమవుతాయి. ఇటువంటి సంఘటనలు సంవత్సరంలో లక్ష మందిలో ఒకరికి వస్తుంది. ఇది ఆరోగ్యవంతమైన పిల్లలపై కూడా ప్రభావం చూపుతుంది. మయోకార్డిటిస్ ఉన్న పిల్లలలో తక్కువ మంది పిల్లలకు తీవ్రమైన గుండె సమస్యలు తలెత్తుతాయి. వారికి ఇంట్రావీనస్ ఆయనోట్రోపిక్ సపోర్ట్ , మెకాని కల్ వెంటిలేషన్‌తో ఇంటెన్సివ్ కేర్ థెరపీ అవ సరం, ఈ చర్యలకు ప్రతిస్పందించని పిల్లలకు ఇసిఎంఒ మద్దతు అవసరం. ఇంటెన్సివ్ కేర్ థెరఫీ లేని పిల్లలలో మరణాలు చాలా ఎక్కువగా ఉంటాయి. బాబు తలిదండ్రులు మాట్లాడుతూ అత్యా ధునిక సదుపాయాలు అనుభవజ్ఞులైన డాక్టర్లు ఉండటం వలన మా బాబుకి పునఃజన్మ ప్రసాదించారని హర్షం వ్యక్తం చేశారు.



బెరాక్ చర్చి ప్రారంభం

బ్రదర్ అనిల్ కుమార్, హాఫీజ్ ఖాన్ హాజరు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కర్నూలు శరీన్ నగర్‌లో నూతనంగా నిర్మించిన బెరాక్‌చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిలుగా ముఖ్య ప్రసంగికులు బ్రదర్ అనిల్ కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ బుధవారం పాల్గొన్నారు. ప్రతేక ప్రార్ధనల అనంతరం రిబ్బన్ కట్ చేసి చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యేసు క్రీస్తును అనుసరించి శాంతి మార్గంలో నడవాలన్నారు. బైబిల్ తెలిపినట్లు వేయి దినములు గడుపుటకంటే దేవుని సన్నిధిలో ఒక్కదినం గడుపుట శ్రేష్టం అనే వాఖ్యాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బ్రదర్ అనిల్‌కు కేక్ తినిపిస్తున్న హాఫీజ్‌ఖాన్

వ్యవసాయ బోర్లకు, పంపుసెట్లకు

మీటర్ల బిగింపు వద్దు...

- ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయ పంపు సెట్లకు, వ్యవసాయ బోర్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు.

విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిఒ 22ను రద్దు చేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. నగదు బదిలీని రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం మీటర్లు బిగించడం సరైనది కాదని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానని ఎన్నికల ముందు చెప్పి ఇప్పుడు ఉచిత విద్యుత్‌ను ఆపేయడం అన్యాయమని అన్నారు. నాణ్యమైన విద్యుత్ కోసం మీటర్లు బిగిస్తామనడం దారుణమన్నారు. అన్ని రాష్ట్రాలు మోటార్లకు మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ఉంటే మన రాష్ట్రం మాత్రం ఉత్సాహం చూపుతోందని విమర్శించారు. మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని కోరారు. రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, అధ్యక్షులు శేఖర్, వ్యకాస జిల్లా నాయకులు లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, రైతు సంఘం నాయకులు హనుమంతు రెడ్డి, తిమ్మారెడ్డి, మునిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

వలస నివారణకు చర్యలు చేపట్టాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది పనులను ప్రారంభించి, వలసల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం గోనెగండ్ల

మొక్కలు నాటుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిసినందున ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఆదేశించారు. జగనన్న గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలు ఉపాధి హామీ చట్టం ద్వారా కల్పించాలని తెలిపారు. అనంతరం ఆయన గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద సుమారు రూ.4 లక్షలతో చేపట్టిన బ్లాక్ ప్లాంటేషన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. ఎపిఒ బొజ్జయ్య, ఈసీ ఉస్మాన్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

- ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్ : పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఎంపిడిఒ గీతావాణి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పెద్ద తుంబలం, దిబ్బనకల్ గ్రామంలో ఎంపిడిఒ

భవనాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

గీతావాణి, పంచాయతీరాజ్ డిఇ ఖాదర్ బాష పర్యటించి ఆర్‌బికె భవన నిర్మాణం, సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ భవనాలను సకాలంలో పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించా రు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఎఇ పాపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

గాది లింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

హాలహర్వి : శ్రీగాదిలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టినట్లు ఎండోమెంట్ అధికారి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక గాదిలింగేశ్వర దేవాదాయ, ఎండోమెంట్ అధికారుల సమక్షంలో హుండీ లెక్కించగా నగదు రూపంలో రూ.25,11,935 వచ్చినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బజారప్ప, ఎస్ఐ విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు శాంతి వాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

'జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి'

మంత్రాలయం : ఈనెల 11న మంత్రాలయంలోని టిటిడి కల్యాణ మండపంలో జరిగే కెవిపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల కార్యదర్శి బొగ్గుల అనిల్ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. నాయకులు మారెప్ప, సురేష్, ఆంధ్రయ్య, దావీదు, దానియేలు, ప్రాణేష్, అబ్రహాం, అయ్యప్ప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోగులకు నమ్మకం కలిగించాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

అనారోగ్యంతో వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించి వైద్యులు వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కోరారు. బుధవారం ఆదోని ఏరియా హాస్పిటల్‌లో డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న అధ్యక్షత వహించారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్య సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆదోని ఏరియా హాస్పిటల్‌లో హాస్పిటల్ అభివృద్ధికి ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య పరికరాలు, శానిటేషన్, విద్యుత్ సమస్యలపై కమిటీలో ప్రస్తావించామన్నారు. పేదలకు ప్రభుత్వాస్పత్రి అంటే నమ్మకం కలిగేలా వైద్యాధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడారు. ప్రతినెలా హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ నిర్వహించిన నివేదికలను ఎంతవరకు పనులు జరిగాయి, ఇంకా పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి అనే

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వాటిపై స్పష్టత కలిగి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనకు సదరం సర్టిఫికెట్ సంబంధించిన అంశాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి సోమవారం క్యాంపునకు సంబంధించిన టెక్నీషియన్ హాజరు కావాలన్నారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, డాక్టర్ పద్మ కుమార్, ఆది, నాగేష్ ఉన్నారు.

సివి.రామన్ సైన్స్ ఎక్స్ ప్రో

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి హాజరు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ఎన్‌జిఒస్ కాలనీలో ఉన్న వివేకానంద జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ ప్రపంచ ఉర్దూ డే సందర్భంగా బుధవారం సివి.రామన్ సైన్స్ ఎక్స్ ప్రో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ ప్రయోగాలను ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వివరించారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, కళాశాల ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ పర్వీన్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

నేడు దేగలపాడులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

- ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని దేగలపాడు గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎంపిపి హేమలత మారయ్య, వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని తెలిపారు. గ్రామంలోని ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తారన్నారు. నియోజకవర్గంలోని ఎంపిపిలు, జడ్‌పిటిసిలు హాజరవుతున్నారని తెలిపారు. గ్రామంలో కడ్లే గౌరమ్మ రథోత్సవం ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అక్రమ వసూళ్లకు పాల్పడలేదు

- గ్రామాభివృద్ధికి ఖర్చు పెట్టాం : సర్పంచి భాస్కర్

మాట్లాడుతున్న వెలమకూరు సర్పంచి భాస్కర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని వెలమకూరులో జల జీవన్ మిషన్ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇంటింటికి కుళాయిలు నిర్మించామని, అదనపు పైపులైన్ల నిర్మాణం కోసం గ్రామస్తుల అంగీకారంతోనే కుళాయి కనెక్షన్ కోసమే రూ.2 వేలు వసూలు చేశామని సర్పంచి భాస్కర్ తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు వైసిపి నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ పేరుతోనే గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వెలమకూరు మజరా గ్రామం సింగాపురంలో వైసిపి నాయకులు చేపట్టిన జల జీవన్ మిషన్ కింద కుళాయిలకు నీటి సరఫరా జరగడం లేదని చెప్పారు. సంబంధిత శాఖాధికారులు విచారణ చేపట్టి ఆ పనులు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు దాసరి జగదీష్, నరసన్న, పరమేష్, సురేష్ పాల్గొన్నారు.

'జిఒ 53ను ఉపసంహరించుకోవాలి'

కోసిగి రూరల్ : జిఒ 53ను ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఉప కులాల సంఘాలు, దళిత సంఘాలు, ఎంఆర్‌పిఎస్, మాల మహానాడు, బుడగ జంగం, దాసరి, ఇతర కులాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రుద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు దుర్గప్ప మాదిగ, చింతకుంట నాగరాజు మాదిగ, సామేల్ మాదిగ, కో కన్వీనర్స్ ప్రకాష్ మాదిగ, ఈరన్న మాదిగ, నరసింహులు, అయ్యప్ప, నరసింహులు, కె.వెంకటేష్, నాగరాజు, వెంకటేష్, పెద్ద రంగయ్య, తోట నరసింహులు, రాజు పాల్గొన్నారు.

అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- 21వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి

ప్రజాశక్తి - ఆదోని

వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటూ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని 21వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం టిడ్కో గృహ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ, శివశంకర్ నగర్, మహాత్మ గాంధీ నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.40 లక్షలు ఖర్చు అయ్యాయని తెలిపారు. సచివాలయం వద్ద ఉన్న పురాతన బావి పునర్నిర్మాణానికి కంచె ఏర్పాటు కోసం రూ.15 లక్షలు మంజూరు చేయించామని చెప్పారు. నాడు-నేడు కింద పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. చింతాంబ బావి నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు మోడల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. రూ.2100 చెల్లించిన 317 మందికి ఇంటి పట్టాలు, టిడ్కో కింద 315 హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్ఆర్ బీమా కింద 712 మందికి నమోదు, 318 మందికి వైఎస్ఆర్ పింఛను కానుక, 415 మందికి సున్నా వడ్డీ కింద ఆర్థిక ప్రయోజనం, విద్యా దీవెన 23, అమ్మఒడి 519, చేదోడు 24, వాహన మిత్ర 26, కాపు నేస్తం 11, ఈబీసీ నేస్తం 20, జగనన్న తోడు 50, నేతన్న నేస్తం 1, వైఎస్ఆర్ చేయూత 165, 32 మందికి టిడ్కో హక్కు పత్రాలు ఇచ్చామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పట్టాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీదేవి

మనేకుర్తి గ్రామం వద్ద ఉదయిస్తున్న సూర్యుడు

ఆహ్లాదం... సూర్యోదయం... : ఉదయించే సూర్యుని అందాలను వీక్షిస్తే ఎంతో ఆనందానిస్తుంది. పచ్చని పొలాలకు వెళ్లే దారిలో సూర్యోదయాన్ని ప్రజాశక్తి ఫొటో క్లిక్‌మనిపించింది. మనేకుర్తి గ్రామంలో బుధవారం సూర్యోదయం కనులవిందు చేసింది. భువి నుంచి సూర్యుడు ఎగసి పడుతూ తన కిరణాలతో పొలానికి వెళ్లే రైతులకు దారి చూపుతున్నట్లు ఎంతో శోభనిచ్చింది. **ప్రజాశక్తి-ఆలూరు**

జాతీయస్థాయి పోటీలకు శ్రీవైష్ణవి విద్యార్థి

ప్రజాశక్తి - మంత్రాలయం

జాతీయ స్థాయిలో అండర్-16 బాలుర అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి ఎంపికయినట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి,

ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్ర తెలిపారు. బుధవారం పదో తరగతి విద్యార్థి బి.నరసింహులును అభినందించారు. ఈ వారు మాట్లాడారు. గత నెల 21, 22, 23న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో 800 మీటర్ల పోటీల్లో మొదటి స్థానం, 2000 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. తమ విద్యార్థి జాతీయస్థాయిలో కూడా విజయం సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని గంగాధర్ రెడ్డి, డీన్ సతీష్, ఎఒ రాఘవేందర్ ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు అశ్విని, శృతి పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి
- ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి-ఆలూరు

నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న, సిఐటియు మండల నాయకులు తిమ్మప్ప కోరారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అగ్రహారం గ్రామంలో రైతులు నారాయణ, వన్నూరు, వీరేష్ సాగు చేసిన పత్తి పంటలను రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయివేట్ కంపెనీలు నకిలీ పత్తి విత్తనాలను యథేచ్ఛగా రైతులకు అమ్మి రూ.కోట్లు కొల్లగొడుతున్నాయని తెలిపారు. రైతులు మాత్రం పత్తి పంట వేసి అప్పులు చేసి దివాలా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రహారం గ్రామంలోనే దాదాపు 50 మంది రైతులు

పత్తి పంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం బృందం

600 ఎకరాల్లో పత్తి సాగు చేశారని తెలిపారు. పంట ఏపుగా పెరిగినా, రెండు, మూడు కాయలున్నా ఎర్ర దుమ్ము తెగులు తగిలి రాలిపోతున్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి జిల్లావ్యాప్తంగా ఏయే కంపెనీలు, ఎంతమంది రైతులకు నకిలీ విత్తనాలు అమ్మాయో పరిశీలించాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులతో కలిసి ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నష్టపోయిన రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బోయ వీరేష్, రంగన్న, వన్నూర్, నారాయణ పాల్గొన్నారు.

సీనియర్ వైద్యులను సన్మానిస్తున్న సభ్యులు

ఘనంగా వరల్డ్ రేడియాలజీ డే

ప్రజాశక్తి-ఆదోని

పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వరల్డ్ రేడియాలజీ డే నిర్వహించారు. ఐఎంఎ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ గోపినాథ్ పాల్గొని మాట్లాడారు. 1895లో కనిపెట్టిన ఎక్స్‌రే యంత్రంతో అత్యాధునిక వైద్య సేవలకు భీజం పడిందని తెలిపారు. రోజురోజుకూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వైద్య సేవలు, ప్రాక్టీసును పెంచుకోవాలన్నారు. ఐఎంఎ పట్టణాధ్యక్షులు ఉషారావు, కార్యదర్శి కిరణ్‌కుమార్, రాష్ట్ర సభ్యులు కృష్ణమూర్తి, హరీష్, రేడియాలజిస్టులు పాల్గొన్నారు.

వలసలు నివారించి, ఉపాధి పనులు కల్పించాలి : ఏపీడీ

దేవనకొండ : వలసలను నివారించి, ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ పద్మావతి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో దండోరా వేయించి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఇప్పటి నుంచి ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు ఎన్ఎంఎస్ఎస్ నుంచి ఉదయం, మధ్యాహ్నం హాజరు ఫొటోతో సహ పంపాలని తెలిపారు. ఉపాధి కూలీలతో కొలతల ప్రకారం పని చేయించి దినసరి వేతనం రూ.257 వచ్చే విధంగా చూడాలని చెప్పారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని తెలిపారు.

తగ్గిన పత్తి ధరలు

ఆదోనిరూరల్ : వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి క్వింటా రూ.9,342 పలికింది. రూ.157 తగ్గడంతో రైతులు విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా పత్తి కనిష్ట ధర రూ.5,686, మధ్య ధర రూ.8,459, గరిష్ట ధర రూ.9,342 వరకు పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెట్‌కు 1076 (4345 క్వింటాళ్లు) లాట్ల పత్తి వచ్చినట్లు చెప్పారు.

ఎర్ర బస్సు ఎరుగరు...

- ఆ గ్రామాలకు ఆటోలే దిక్కు
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

ప్రజాశక్తి - హొళగుంద

ఇంటర్నెట్ యుగం నడుస్తున్న ఈ రోజుల్లోనూ కర్ణాటక సరిహద్దు గ్రామాలకు రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల అభివృద్ధిపై పాలకులకు సరైన చిత్తశుద్ధి లేకపోవడం వల్ల పల్లెవాసుల సమస్యలు తీరడం లేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రతి అవసరానికీ సమీపంలోని పట్టణానికి వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి పట్టణాలకు వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఎర్రబస్సు ఎరుగరు...

హొళగుంద మండలం కర్ణాటకకు సరిహద్దు ప్రాంతం. ఈ మండలంలో వన్నూరు, నాగరకన్వి, పెద్దహ్యాట, బిజి.హళ్లి గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు వెళ్లవు. ఈ గ్రామాల ప్రజలు ఆటోలపై ఆధారపడి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. నాగరకన్వి, వన్నూరు గ్రామాల ప్రజలు మార్లమడికి వరకు బస్సుపై వెళ్లి అక్కడి నుంచి మూడు, నాలుగు కిలోమీటర్లు కాలినడకన నడిచి గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. 20, 30 కిలోల లగేజీ నెత్తిన పెట్టుకొని మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు. పెద్దహ్యాట, బిజి.హళ్లి గ్రామస్తులు కూడా ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ఆటోలపై ఆధారపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో గంటలకొద్దీ వేచి ఉండి పట్టణాలకు వెళ్తున్నారు.

పట్టించుకోని పాలకులు

పాలకులు పట్టించుకోకపోవడం వల్ల తమ జీవితాలు మారడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. హొళగుందకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్లమడికి నడుచుకుంటూ వెళ్లి బస్సులకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. లగేజీతో నడవాలంటే ఎంతో భారమౌతోంది. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

ఆటోలో వెళ్తూ ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు (ఫైల్)

బస్సు సౌకర్యం కల్పించాలి

- వెంకటేష్, సిపిఎం నాయకులు

బస్సు సౌకర్యం లేక గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నాగరకన్వి, వన్నూరు, పెద్దహ్యాట, బిజి.హళ్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. అధికారులు స్పందించి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

పైపులైన్ మరమ్మతులకు తప్పని నిరీక్షణ

ప్రజాశక్తి - నందవరం

మూడేళ్లు గడుస్తున్నా తాగునీటి పైపులైన్‌కు మరమత్తు చేయలేని స్థితిలో వైసిపి నాయకులు ఉన్నారని ఎంపిటిసి బోయ వెంకటేశ్వరమ్మ, టిడిపి తెలుగు యువత ఉపాధ్యక్షులు వీరేష్ విమర్శించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. నాగలదిన్నె, మిట్టా సోమాపురం గ్రామ ప్రధాన రహదారి వెంట వంక వద్ద టిడిపి ప్రభుత్వ

ప్రధాన రహదారి పక్కనే పగిలిన పైపులైను

హయాంలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పైపులైన్ పగిలి మూడేళ్లయినా మరమ్మతులు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే, గ్రామంలోని వైసిపి నాయకులు మాత్రం తాగునీటి సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. సర్పంచి, అధికార పార్టీ నాయకులు తాగునీటి కోసం ఖర్చు చేస్తున్నామని రికార్డులు పుట్టించి డబ్బులు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నారని అన్నారు. పైపులైన్ ద్వారా వచ్చిన తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. సర్పంచి, అధికారులు స్పందించి వంక వెంట కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. టిడిపి నాయకులు లింగన్న, రామలింగడు, కృష్ణ మూర్తి, అరేకంటి భాస్కర్ పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలి

- వైసిపి జిల్లా కమిటీ సభ్యులు అత్రి గౌడ్

ప్రజాశక్తి - కౌతాళం

విద్యారంగంలో సాంకే తిక విజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలని వైసిపి జిల్లా కమిటీ సభ్యులు అత్రి గౌడ్, మండల కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఏకం రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఉప్పరహాల్ జిల్లా పరిషత్ కన్నడ ఉన్నత పాఠశాలలో ఈ-కంప్యూటర్ క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న మారుమూల గ్రామం ఉప్పరహాల్‌లో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నందుకు అభినందించారు. పూర్వ విద్యార్థి సాయి ప్రసాద్ రెడ్డి బెంగళూరులో సిఎస్‌జి కంపెనీలో ఉద్యోగి అని, కంపెనీ ద్వారా రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్ సామగ్రిని పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మండల నాయకులు బసవప్రభు, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, గ్రామ ప్రముఖులు చంద్రయ్య స్వామి, విడి.భీమన్న గౌడ్, లింగన్న, చిన్న మహాదేవ, రామ గోవిందప్ప, రవికుమార్ స్వామి, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ బాష, ప్రధానోపాధ్యాయులు గంగాధర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ క్లాసులను ప్రారంభిస్తున్న అత్రి గౌడ్

బహుమతి అందజేస్తున్న మాజీ సర్పంచి మల్లేష్

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- మాజీ సర్పంచి మల్లేష్

ప్రజాశక్తి - ఆస్పరి

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని మాజీ సర్పంచి మల్లేష్ తెలిపారు. గౌరీ పౌర్ణమి సందర్భంగా జోహరాపురంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. అతిథిగా మాజీ సర్పంచి మల్లేష్ పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి జోహరాపురం జట్టు దాత మాజీ సర్పంచి మల్లేష్ రూ.5,116, రెండో బహుమతి ఆస్పరి జట్టుకు దాత లాలప్ప రూ.3,116, మూడో బహుమతి కైరుప్పల జట్టుకు డీజిల్ లింగన్న రూ.2,116 చేతుల మీదుగా అందజేశారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శులు రవి, సురేంద్ర, చిన్న మల్లేష్ పాల్గొన్నారు.

పాఠశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలి

- విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని పాఠశాలలకు సమీపంలో ఉన్న రహదారులకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు రవి కోరారు. బుధవారం పెద్దహోతూరు గ్రామంలో కర్నూలు, బళ్లారి ప్రధాన రహదారి పక్కనున్న ఎంపిపి, జడ్‌పి హై స్కూల్, ఆది ఆంధ్ర పాఠశాలల సమీపంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని గ్రామ సచివాలయ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. విద్యార్థుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్అండ్‌బి అధికారులు, గ్రామ, మండల అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లాలంటే ప్రధాన రోడ్డును దాటాలని తెలిపారు. మండలంలోని రహదారుల పక్కనున్న గ్రామాలు, పాఠశాలలకు సమీపంలో ప్రధాన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ వేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే మండల విద్యార్థులతో కలిసి రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నరసింహ, మల్లి, నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : ఆదోని
O.S.No. 202/2020

Between :
ఎ. వేమా రెడ్డి ... వాది
V/s.
కుప్పం గురురాజా S/o కుప్పం రామలింగప్ప,
R/o. పెద్దహరివాణం గ్రామం, ఆదోని మండలం,
కర్నూలు జిల్లా. .... ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాది అయిన మీపై ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా వాయిదా 09-12-2022. తేదీన వున్నది. ఉదయం 10.30 గంటలు పై కోర్టునందు మీరుగాని, మీ తరపున న్యాయవాదిగాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియజేసుకొనవచ్చును. అటు రానిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించడునని తెలియజేయుచున్నాము.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//
వాయిదా తేది: 09-12-2022

శ్రీ బి. హరి సర్వోత్తమ రెడ్డి,
వాది తరపు వకీలు, ఆదోని.
సెల్ : 9849314408

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ADONI
S.O.P.No. 12/2022

Between:
Gaikwad Lalitha & another ..... Petitioners
V/s
To whom so ever it may concern
..... Respondent

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పోతి J.కృష్ణ బాయి గారి కుమార్తెలు గైక్వాడ్ లలిత C. నిర్మల బాయి అను అర్జీదారులు మహారాజ శ్రీ ఆదవాని సీనియర్ సివిల్ జడ్జీ కోర్ట్ లో తమ తల్లి పోతి J.కృష్ణబాయి రూ.53,400/- (అక్షరాల యబ్బైమూడు వేల నాలుగు వందలు) ప్రొవిడెంట్ ఫండ్ అక్కౌంట్ బేయరింగ్ నెంబర్ : PPO.No.28924లో Employees Provident Fund Organization Regional Office, Kadapa నుండి తీసుకొనుటకుగాను Succession Certificateను C.నిర్మల బాయి గారి పెరట ఇవ్వవలసినదిగా S.O.P.No.12/2022 అను అర్జీ దాఖలు చేసియున్నారు. ఇందు గురించి ఎవరికైన ఏమైన అభ్యంతరములు ఉన్న యడల ఆదోని సీనియర్ సివిల్ జడ్జ కోర్ట్ లో 06-12-2022వ తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అభ్యంతరములను తెలిపవలేయునని తెలియజేయడం అయినది.

కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది: 06-12-2022

A. లక్ష్మీనారాయణ, M.A.,B.L.,
K. నాగరాజ్
పిటిషనర్ అడ్వకేట్స్, ఆదోని
సెల్ : 9652482161

అడుగుకో గుంత..

- వాహనదారులకు, భక్తులకు తప్పని అగచాట్లు
- కార్తీక మాసంలోనూ సౌకర్యాలు కల్పించడంలో అధికారుల అలసత్వం

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవ క్షేత్రం మహానంది పుణ్యక్షేత్రానికి ప్రతి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ కార్తీక మాసంలో క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటుంది. మహానందికి గాజులపల్లి గ్రామం మీదుగా వయా బోయలకుంట్ల మెట్ట నుండి వాహనాల్లో రావాలంటే భక్తులు భయపడే పరిస్థితి దాపురించింది. ఎంసీ ఫారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల నుండి అడుగడుగుకూ ఒక గుంతతో వాహనాల్లో వచ్చే భక్తులు తిప్పలు పడుతున్నారు. వ్యవసాయ కళాశాల నుండి మహానంది క్షేత్రంనకు మూడు కిలోమీటర్లు ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. వాహనాలు రిపేర్లకు వచ్చే పరిస్థితులు కూడా ఎక్కువగా ఉన్నాయి. రాళ్లతో కూడిన గుంతలకు తాత్కాలికంగా వేసిన ప్యాచింగ్ పనులు తప్ప ఇంత వరకు శాశ్వత పరిష్కార మార్గాల వైపు ఆలోచించిన దాఖలాలే లేవు. రాళ్లు బయటికి తేలిన గుంతలతో అస్తవ్యస్తంగా రోడ్లు భక్తులకు దర్శనమిస్తుంటాయి. దర్శనానికి వచ్చే ప్రతి భక్తునికి ఆలయ ఆదాయం కొన్ని కోట్లలో ఉన్నా రోడ్డు సదుపాయం ఎందుకు కల్పించడం లేదో అర్థం కావడం లేదని సందేహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షం పడినా కూడా గుంతలతో కూడిన రోడ్లన్నీ నీటి కుంటలుగా దర్శనమిస్తున్నాయి. కొన్ని వందల కిలోమీటర్ల నుండి వచ్చిన కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు అన్ని కిలోమీటర్ల ప్రయాణం ఒక ఎత్తయితే ఈ మూడు కిలోమీటర్ల ప్రయాణం మరో ఎత్తుగా మారుతోంది. టోల్ గేట్ నిర్వాహకులతో రోడ్ల ను గూర్చి గొడవ పడిన సందర్భాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఇదే మార్గం గుండా ఎక్కువ శాతం రైతులు అరటి పంటలను గుంటూరు, విజయవాడ వైపు అరటి పంట లారీలలో ఎగుమతి చేస్తుంటారు. ఆ లారీ డ్రైవర్ల బాధలు వర్ణనాతీతం. ఈ రోడ్ల పరిస్థితిని గూర్చి ఆలయ ఉన్నతాధికారి చాలా మార్లు సంబంధిత అధికారులకు సమాచారం అందించినా రోడ్లు భవనాల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా భక్తుల సౌకర్యం కోసం ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేసే విధంగా, శాశ్వత పరిష్కారం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు, రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

గుంతలు పడిన రోడ్డు

శిరివెళ్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్లలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, బాలికల వసతి గృహం, సచివాలయాలు, జగనన్న లే అవుట్‌లను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో గంటకు పైగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశమై ఆయా శాఖల పని తీరుపై ఆరా తీశారు. శిరివెళ్లలోని సచివాలయం-2ను తనిఖీ చేయగా సిబ్బంది ఇద్దరే ఉండటం, కొందరు అందుబాటులో లేకపోవడంతో సంబంధిత అడ్మిన్‌స్ట్రేటివ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిధుల వ్యయం, పనుల పురోగతి పై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని హెచ్చరించారు. అలాగే కస్తూరిబా బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను, భోజన నాణ్యతను పరిశీలించారు. మజరా గ్రామం కాదరబాదరలో జగనన్న లే అవుట్లను పరిశీలించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న ధాన్యం ఆరబోసిన మహిళా రైతు వద్దకు వెళ్లి పెట్టుబడి, దిగుబడి, గిట్టుబాటు ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఇఒపిఆర్డి సాల్మన్ రాజ్, తహసిల్దార్ షేక్ మొహిద్దీన్, హౌసింగ్ ఏఈ అహ్మద్ బాషా, వర్క్ ఇన్స్పెక్టర్ మౌలాలి, రెవిన్యూ, సచివాలయం సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న ప్రజలు

పెండింగ్ భూసేకరణ పూర్తి చేయండి

- తహాశీల్దార్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ రహదారులు 340 ఏ, బి,సి, 167కె కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ, క్లైములు పరిశీలించి అవార్డు పాస్ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత ఆర్డీఓలు, తహాశీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ రహదారుల భూసేకరణ, అవార్డు ఎంక్వయిరీపై నేషనల్ హైవే అధికారులు, సంబంధిత ఆర్‌డిఒ, తాసిల్దార్లతో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 340సి కి సంబంధించి 224 హెక్టార్లలో అవార్డు ఎంక్వయిరీ పూర్తయిన ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలాల్లోని భూములను పరిశీలించి మార్కెట్ విలువలను సేకరించి నివేదిక ఇవ్వాలని ఆత్మకూరు ఆర్డీవోను ఆదేశించారు. 340బి కి సంబంధించి సోమయాజుల పల్లె నుండి డోన్ వరకు 116 హెక్టార్లలో సబ్ డివిజన్ రెవెన్యూ రికార్డులను పరిశీలించి మూడు రోజుల్లో నివేదికలు అందజేయాలని సూచించారు. 167కె కి సంబంధించి నంద్యాల, బండి ఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో ఉన్న 220 హెక్టార్లలో పెగ్ మార్కింగ్ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ స్తంభాల తొలగింపునకు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని జెసికి సూచించారు. రైల్వే, ఆర్ అండ్ బి, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎమ్.దాసు, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ బలరామ కృష్ణయ్య, సైట్ ఇంజనీర్ రామ్ కుమార్, నేషనల్ హైవే తాసిల్దార్ గురప్ప శెట్టి, సంబంధిత మండల తాసిల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ఆర్థిక మంత్రి సహకారంతో అభివృద్ధి

- అన్యాక్రాంతమైన స్థలాలు స్వాధీనం - ప్లాస్టిక్ నిషేధానికి ప్రత్యేక చర్యలు
- విస్తృతంగా మొక్కలు నాటి కాపాడుతున్నాం
- ఉపాధి కోసం యువతకు నైపుణ్య శిక్షణ
- ప్రజాశక్తితో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

'ఆర్థిక శాఖామంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో డోన్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాం. దాదాపు రూ.200 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఆరునుంచి ఏడు నెలల్లో పూర్తి చేస్తాం. అన్యాక్రాంతమైన మున్సిపల్ స్థలాలను గుర్తించి పెన్సింగ్ వేస్తున్నాం. ప్లాస్టిక్ నిషేదానికి స్వచ్ఛంద సంస్థలను, పొదుపు మహిళలను భాగస్వామ్యం చేస్తున్నాం. విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. కాలుష్య నివారణకు నగరంలో విస్తృతంగా మొక్కలు నాటాం. యువతకు ఉపాధి కల్పనకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నాం.' అని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన అనేక అంశాలను బుధవారం వివరించారు.

మున్సిపల్ చైర్మన్ పదవి చేపట్టి ఏడాదిన్నర దాటింది ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.?

చైర్మన్ : కూరగాయల మార్కెట్ , మున్సిపల్ భవనాలనిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా రోడ్డు గాంధీబొమ్మనుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు 60పీట్ల రోడ్డు నిర్మిస్తున్నాం. ఇండోర్‌స్టేడియం, స్పోర్ట్స్‌క్లబ్, ఐటిఐలో 300 బెడ్ల హాస్టల్ భవనం, కర్నూలు జాతీయ రహదారి నుంచి గుత్తిరోడ్డు వరకు 100 పీట్ల రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, మధ్యలో పూలమొక్కలు నాటే విధంగా పనులు చివరి దశలో ఉన్నాయి. 100 బెడ్ల హాస్పిటల్ నిర్మాణంలో ఉంది. ఐదు పార్కుల పనులు ప్రారంభించాం. రెండు పూర్తయ్యాయి. ఒకటి ప్రారంభించాం. స్విమ్మింగ్‌పూల్ పనులు నడుస్తున్నాయి. గ్రీన్‌డోన్ కోసం విస్తృతంగా మొక్కలు నాటి 80 శాతం బతికేలా చర్యలు తీసుకున్నాం. బిసి వెల్ఫేర్ బాలబాలికల హాస్టల్‌కం స్కూల్స్ మంజూరు చేయించాం. ఇలా మొత్తం దాదాపు రూ.200 కోట్ల నిధులతో పనులు నడుస్తున్నాయి. ఆరు నుంచి 7 నెలలో పనులన్ని పూర్తవుతాయి. ఈ పనులన్నీ పూర్తయితే ఆర్థిక మంత్రి పేరు డోన్‌లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ప్లాస్టిక్ నిషేదానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?.

చైర్మన్: ప్లాస్టిక్ నిషేదంపై ముందుగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛంద సంస్థలు, పొదుపు మహిళలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులతో ప్రదర్శన చేశాం. దుకాణాలను సందర్శిస్తున్నాం. ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించేవారిపై జరమానాలు కూడా వేస్తున్నాం.

సచివాలయాల వారిగా నిధులు ఎంత వచ్చాయి. ఎంత ఖర్చు అయింది?

చైర్మన్: మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డులున్నాయి. 16 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఆరు సచివాలయాల పరిధిలో పనులు పూర్తయ్యాయి. రూ.1.20 కోట్ల నిధులు ఖర్చుచేశాం.

పన్నుల వసూళ్లు ఎలా చేస్తున్నారు. ఎంతశాతం రీచ్ అవుతున్నారు?.చెత్త పన్ను వసూలు చేస్తున్నారా?

చైర్మన్ : పన్నుల వసూళ్లలో 65 నుంచి 70 శాతం రీచ్ అవుతున్నాం. మా మున్సిపాలిటీ పరిధిలో చెత్తపన్ను వేయడం లేదు.

యువతకు ఉపాధి శిక్షణ ఎలా చేపడుతున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయా?

చైర్మన్ : యువతులకు, యువకులకు రెండు యూనిట్లుగా విభజించి స్కిల్ డెవలఫ్‌మెంట్ శిక్షణ ఇస్తున్నాం. ఆర్థికమంత్రికి స్కిల్‌డెవలఫ్ శాఖ కూడా ఉండటం వలన ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కియో, సాంసంగ్, ఇతర కంపెనీలకు కావల్సిన యువతను తయారు చేసేందుకు ఆయా కంపెనీల రిసోర్స్ పర్సన్స్‌తో వారికి ఉపయోగపడే శిక్షణ మూడునెలల పాటు ఇస్తున్నారు. యువత సంఖ్యకు తగినట్లుగా ఉదయం , సాయంత్రం బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నాం. మహిళలకు రూ.లక్ష విలువ జేసే కుట్టుమిషన్లపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వారందరికీ బళ్లారి, బెంగుళూరు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి. ప్రారంభ వేతనం ఒక్కొక్కరికి రూ.18000 వస్తుంది.

కిందిస్థాయి నాయకత్వానికి పనులు ఇవ్వడం లేదని అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం జరుగుతుంది, నిజమేనా?

చైర్మన్ : వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో అలాంటి ప్రచారం జరిగింది. వాస్తవమే. గతంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పనులు ఇచ్చేవారు. అలా కాకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులందరికీ కావల్సిన పనులు అవుతున్నాయి. ఎలాంటి పైరవీలు లేకుండా సచివాలయ వ్యవస్థ వచ్చింది. అన్నీ అర్థమైన తరువాత అందరూ అర్థం చేసుకుంటున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

చైర్మన్ : అక్కడక్కడ రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నాం. బాధితులకు నచ్చజెప్పి పరిహారం ఇప్పిస్తున్నాం. అన్యాక్రాంతమైన మున్సిపల్ స్థలాలను కూడా స్వాధీనం చేసుకుని పెన్సింగ్ వేస్తున్నాం.

మీరు రాజకీయాల్లోకి వచ్చాక అనుకున్న లక్ష్యం నెరవేరిందా? సంతృప్తికరంగా ఉన్నారా? .

చైర్మన్: సంతృప్తిగా ఉంది. ప్రజలకు, మున్సిపాలిటీకి నెలలో 27 రోజులు అందుబాటులో ఉంటున్నాను. ప్రజలలో కలిసి ఉంటున్నాం. అంతకంటే ఇంకేం కావాలి. ప్రజలకు సేవ చేయాలని వచ్చాను. చేస్తున్నాను. అంతకు ముందు ప్యాపిలి ఎంపిపిగా చేశాం.

జొన్న పంటను దున్నేస్తున్న దృశ్యం

జొన్న పంటను దున్నేసిన మహిళా రైతు

చాగలమర్రి : రబీలో సాగు చేసిన జొన్న పంట అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల దెబ్బతింది. పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో చాగలమర్రి గ్రామానికి చెందిన మహిళా రైతు వలిసా గారి బీబీ సాగు చేసిన 6 ఎకరాల్లో జొన్న పంటను బుధవారం దున్నేశారు. రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని మహిళా రైతు కోరారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

బండి ఆత్మకూర్ : మండలంలోని ఈర్నపాడు గ్రామంలో బుధవారం కెసి కెనాల్ దగ్గర ఉన్న తాగునీటి బోరుకు సర్పంచి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పైపులు లీకేజీ కావడంతో నీరు అందక గ్రామంలోని ప్రజలు ఇబ్బందులు పడుతుండగా రిపేరు చేయించినట్లు చెప్పారు. అలాగే ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వైసిపి సీనియర్ నాయకులు పెద్ద రామ సుబ్బారెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎంపిపి

నందికొట్కూరు : ఆరోగ్య సమస్యలతో సతమవుతున్న పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ పథకం ఒక వరమని, ఆరోగ్యానికి భరోసా లాంటిదని ఎంపిపి మురళి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని వడ్డెమాన్ గ్రామానికి చెందిన వేముల కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. సిఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరయిన మంజూరైన రూ. 42 వేలు చెక్కును వేముల కృష్ణా రెడ్డి భార్య సరోజమ్మకు ఎంపిపి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అశోక్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎంపిటిసి దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

పగిడ్యాల : మండలంలోని ఆయ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఇఒ పి.సుభాన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. మండలానికి 5600 పుస్తకాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 1 నుండి 10వ తరగతి వరకు రెండవ సెమిస్టర్ పుస్తకాలను ఆయ పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశామన్నారు.

16న రాయలసీమ హక్కుల పత్రంపై దీక్ష

- సత్యాగ్రహ దీక్షకు వామపక్షాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల

ఈ నెల 16న విజయవాడ ధర్నా చౌక్‌లో రాయలసీమ హక్కుల పత్రంపై సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. సత్యాగ్రహ దీక్షలో పాల్గొని, రాయలసీమ హక్కుల పత్రం శ్రీబాగ్ ఒడంబడిక అమలుకు సహకరించాలని బుధవారం విజయవాడలో వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులను ఆయన ఆహ్వానించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి కిషోర్ బాబు, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు కె.పొలారి, సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకులు హరినాథ్, ఎంసిపిఐ (యు) రాష్ట్ర నాయకులు ఖాదర్ బాష, ఎస్‌యుటిఐ రాష్ట్ర నాయకులు సుధీర్‌లకు ఆహ్వానపత్రం అందజేసి సత్యాగ్రహ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కూడా ఆహ్వానపత్రం అందించి ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రచార కార్యదర్శులు ఎంవి.రమణారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రం అందచేస్తున్న నాయకులు

గర్భిణులకు మెరుగైన సేవలు అందించండి : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలోని స్కానింగ్ కేంద్రాన్ని చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్‌లు సందర్శించారు. ముందుగా గర్భిణులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డాక్టర్‌ను నియమించే విధంగా వైసిపి ప్రభుత్వం ముందుకెళుందని తెలిపారు. శ్రీశైలం మ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అత్యాధునిక పరికరాలతో త్వరలోనే వైద్య సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీ గర్భిణులకు స్కానింగ్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, వైద్యశాల సూపరింటెంట్ వెంకటరమణ, వార్డు కౌన్సిలర్ రంగస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులతో మాట్లాడుతున్న చైర్మన్

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూర్ : గుడివాడలో ఈ నెల 10, 11వ తేదీల్లో జరుగుతున్న ఎపి బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 7వ రాష్ట్ర మహాసభలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం పట్టణ కార్యదర్శి ఇస్మాయిల్, అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సురేంద్ర, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్‌లు కోరారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2019 నుండి కార్మికుల క్లైములు, గుర్తింపు కార్డులు పరిష్కారం కావడం లేదన్నారు. జిల్లాలో సుమారు వెయ్యి క్లైములు పెండింగ్లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోర్డుకు తిరిగి నిధులు జమ చేయాలని, పెండింగ్ క్లైమ్‌లను పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులను నిర్మాణ కార్మికుల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. రాష్ట్ర మహాసభలో అధిక సంఖ్యలో భవనిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కృషి : చైర్మన్

- జువ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, స్టాఫ్ సహకారంతో జువ్వాజీ సుంకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు, రోగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. గర్భిణులకు, రోగులకు అన్నదానం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. డాక్టర్ రాయుడు నేతత్వంతో వైద్యులు మెరుగైన చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. 200 మంది పైగా గర్భిణులు చికిత్స కోసం ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారంటే అది వైద్యుల సేవకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి నుంచి 50 పడకల హాస్పిటల్‌కు సహకారం కావాలని డాక్టర్ రాయుడు చైర్మన్‌ను కోరారు. షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ద్వారా ఉన్నతాధికారులతో చర్చించి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జువాజీ సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ బద్దల శ్రీకాంత్, శ్లోకా విద్యా సంస్థల చైర్మన్ సూది రెడ్డి శ్రీధర్ రెడ్డి, నవనంది స్కూల్ కరస్పాండెంట్ బద్దల శ్రీధర్, కిరాణం మర్చెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మన్సూర్, కౌన్సిలర్ లాలూ ప్రసాద్, మధు యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, చల్లా శివారెడ్డి, శివశంకర్, శ్రీ నంది కాలేజ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న నాయకులు సద్దాం హుస్సేన్

పేదలకు భూ పంపిణీ చేయాలి : వ్యకాసం

గోస్పాడు : ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాల భూమి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సద్దాం హుస్సేన్, బంగారయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం గోస్పాడు మండలంలో రెండవ మహా సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల రూపాయలు ఇవ్వాలని, అలాగే ఐదు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని చట్టం తీసుకురావాలన్నారు. కనీస వేతనం 600 రూపాయల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కరి ముల్లా, ప్రధాన కార్యదర్శిగా ఎన్.చెన్నయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రుడు నాగన్న రామాంజనేయరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలన్న పాల్గొన్నారు.

11న వ్యాసరచన పోటీలు

ప్యాపిలి : ఎస్‌టియు ప్యాపిలి మండల శాఖ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 11న వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో జవహర్ లాల్ నెహ్రూ పాత్ర' 'నవభారత నిర్మాణంలో ప్రధానమంత్రిగా జవహర్ లాల్ నెహ్రూ పాత్ర' అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటుందని, విజేతలకు ఈ నెల 14న బహుమతులు అందజేస్తారన్నారు. వివరాలకు 9494737107, 9951791562 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల సబ్ డివిజన్‌లో మద్యం కేసులలో పట్టుబడిన 38 వాహనాలకు సంబందిత అధికారుల అనుమతితో నంద్యాల అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆర్.రమణ ఆధ్వర్యంలో టౌన్ డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో బుధవారం వేలం వేశారు. 25 బైకులకు రూ.3,96,200, 5 ఆటోలకు రూ.3,31,000, 1 కారుకు రూ.1,22,000 వచ్చింది. కార్యక్రమంలో టౌన్ సిఐలు, ఎస్ఈబి సిఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ, నంద్యాల డిఎస్పి

పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

- జూనియర్ సివిల్ జడ్జి కిశోర్ కుమార్

ప్రజాశక్తి - బనగానపల్లె

న్యాయ సేవాసదస్సుల ద్వారా పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడమే లక్ష్యమని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, న్యాయ సేవా సహకార సంస్థ చైర్మన్ కిశోర్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుండి పెట్రోల్ బంకు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పెద్దఎత్తున కక్షిదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.ఆర్. జగన్నాథరెడ్డి, కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు టి.మాధవరెడ్డి, ఎం పరశురామిరెడ్డి, ఎం రఘురామిరెడ్డి, అజాం హుస్సేన్, జేమ్స్, ప్రకాష్ రెడ్డి, తులసమ్మ, ఖాజా హుస్సేన్, అల్లాఉద్దీన్, బాలుడు, ముజాహిద్ హుస్సేన్, బాబు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని కోర్టు ఆవరణంలో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఐదవ అదనపు జిల్లా జడ్జి వాసు ఆదేశాల మేరకు న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఏపిపి సోమశేఖర్ రెడ్డి, న్యాయవాదులు మురళీధర్ గౌడ్, సుబ్బరామిరెడ్డి, కె.వి. సుబ్బయ్య, సరిత, నరేష్ మురళీమోహన్, మల్లికార్జున, తిమ్మయ్య, వెంకటయ్య, ఏజిపి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్రావు, జూనియర్ సివిల్ జడ్జి రఘునాథ్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట మల్లికార్జున, బార్ అధ్యక్షులు గిరిరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబు రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది సుధాకర్ రెడ్డి, సిఐ సుబ్రహ్మణ్యం, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోయిలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అరికట్ల మల్లికార్జున రెడ్డి, న్యాయవాదులు జి యల్ నరసింహులు, నాగ శేషు, ఓబులేసు, తిరుపేలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫిర్దోస్ అంజుమ్, లాయర్లు కంబగిరి, ఇంద్ర కుమార్ పాల్గొన్నారు.

బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి, న్యాయవాదులు

ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి, న్యాయవాదులు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

14న వ్యకాసం మండల మహాసభ

పగిడ్యాల : ఈ నెల 14న వ్యకాసం పగిడ్యాల మండల మహాసభను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పి.వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో వ్యకాసం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వరమ్మ, ఎం.లక్ష్మన్న అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపులలో 15 రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలన్నారు. నాయకులు ఫారుక్, నాగన్న, తిరుపాలు పాల్గొన్నారు.

కుందూలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సమీపంలో కుందూనదిలో సోమవారం గల్లంతయిన కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన అంబటి కొండారెడ్డి మృతదేహం బుధవారం లభ్యమయినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ కాకరవాడ సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు. మృతుడి అన్న అంబటి లోకేశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అసభ్యకర వీడియో కాల్స్‌పై ఫిర్యాదు చేయండి

పాములపాడు : మండల పరిధిలో కొంతమంది మహిళలకు అసభ్యకరమైన వీడియో కాల్స్ వస్తున్నట్లు తెలిసిందని, బాధిత మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పాములపాడు ఎస్సై జి అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగాఉంచి కాల్స్ చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసినట్లయితే వారి ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. మరింత ఇబ్బంది కలిగిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు.

అంగన్‌వాడీ స్కూల్‌కు ఇన్నర్‌వీల్‌క్లబ్ ప్రోత్సాహం

డోన్ : డోన్ త్రివర్ణ కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్ విద్యార్థులకు 'ఇన్నర్ వీల్ క్లబ్' ఆధ్వర్యంలో పలకలు, ఆటబొమ్మలు, బిస్కెట్లు, వంటసామగ్రి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు ఆర్‌టిసి ఆర్ఎ శాంతి మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలతో ఆటలాడి సరదాగా గడిపి వారికి బిస్కెట్స్, పలకలు పంపిణీ చేశామని చెప్పారు. విద్యార్థులకు ఆటపాటలతో విద్యపట్ల ఆసక్తి పెంపొందించేలా కృషి చేస్తున్నా మన్నారు. దాత ఇన్నర్‌వీల్‌క్లబ్ సెక్రెటరీ సుస్మిత ఆర్థిక సహ కారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పిల్లలు, వారి తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సుమి త్ర, శైలజ, మంజుల, సరళ, అనురాధ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులతో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు ఆర్‌టిసి ఆర్ఎ శాంతి, సెక్రెటరీ సుస్మిత, సభ్యులు

ఓట్లు వేయలేదని రోడ్లు వేయకపోవడం దారుణం : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల నగర పంచాయతీ ఎన్నికలలో 15వ వార్డులో టిడిపి అభ్యర్థిని గెలిపించారని, వైసిపికి ఓట్లు వేయలేదని దళితులు నివాసం ఉంటున్న కోటపేటలో ఉన్న సిమెంట్ రోడ్డును జెసిబితో తొలగించి గ్రావెల్ కంకర వేసి 9 నెలలయినా సిసి రోడ్డు వేయక పోవడం దారుణమని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, విజయ్ బట్టు పేర్కొన్నారు. బుధవారం బేతంచెర్లలో బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా కోటపేట, వడ్డపేట, రేగుమాను పేట కాలనీలలో మండల కార్యదర్శి. ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, మేకల నాగరాజు ఆధ్వర్యంలో వారు పర్యటించారు. ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గౌరు వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పుట్టి పెరిగిన బేతంచెర్లలో డబల్ రోడ్లు వేస్తూన్నారు తప్ప కోటపేట దళితుల పట్ల వివక్ష ఇంత దారుణంగా చూపడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. మండలంలోని గ్రామాలలోని ప్రజలను వైసీపీ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి పార్టీ కండువాలు వేసి బలవంతంగా చేర్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళల మరుగుదొడ్ల విషయంలో కూడా మంత్రి రాజకీయాలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నం చంద్రశేఖర్ చౌదరి, ఎల్ల నాగయ్య, ఆనంద్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, ఎమ్మెస్ భాష, బాబు, రాముడు, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు వేయకుండా వదిలేసిన కంకరను చూపుతున్న స్థానికులు

హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలు కల్పించాలి : ఎంపిడిఓ

చాగలమర్రి : మండలంలోని జగనన్న కాలనీలలో అమలవుతున్న గృహ నిర్మాణాల పనులకు సంబంధించి లబ్ధిదారులకు 90 రోజులు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాల్సి ఉంటుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 5వ గ్రామ సచివాలయం పరిధిలోని వాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హౌసింగ్ లబ్ధిదారులకు పనులకు సంబంధించి అంచనాలను వేసి జాబు కార్డ్ తనిఖీ చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారునికి తప్పనిసరిగా జాబ్ కార్డులు ఇప్పించాలని ఆయన కోరారు. సమావేశంలో మండల విస్తరణ అధికారి నాగేంద్రయ్య, మేజర్ గ్రామపంచాయతీ పరిపాలనాధికారి సుదర్శన్ రావు, ఉపాధి ఎపిఓ నిర్మల, టెక్నికల్ అసిస్టెంట్లు నరసింహారావు, వెంకటయ్య తిరుపతయ్య, జ్వాలా నరసింహులు, ప్రసాదు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు పాల్గొన్నారు.

15 నుండి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈనెల 15వ తేదీ నుండి ఇంటింటికి తిరిగి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి శిశు సంక్షేమ, విద్యా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ జిల్లా సమాచార, తదితర శాఖల సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సూచనలు, సలహాలతో జిల్లాలోని అన్ని గ్రామ, పట్టణాల్లో ఆశా కార్యకర్తలు, వాలంటీర్స్ చేత ప్రతి ఇంటిని సందర్శించి కుష్టి వ్యాధి అనుమానిత, స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల వద్దకు పంపి వ్యాధి నిర్ధారణ చేసి ఉచితముగా మందులు అందించనున్నట్లు చెప్పారు. అనంతరం కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ బాలాజీ, డిఐఓ డాక్టర్ ప్రభావతి, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, డిసిహెచ్ఎస్ డా. జపుల్లా డా. మల్లికార్జున రెడ్డి, ఐఅండ్ పిఆర్ డిఐపిఆర్ఓ జయరావ్, డిప్యూటీ డి ఇఒ ఎంఎం బేగ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి, డిప్యూటీ డెమో రవీంద్రనాయక్, లెప్రసీ అసోసియేషన్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, కుష్టు వ్యాధి నిర్మూలన కార్యాలయ అధికారులు విజయ్ కుమార్, గంగాధర్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న డిఎంహెచ్ఓ తదితరులు

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాణిశ్రీ

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు : డాక్టర్ వాణిశ్రీ

ప్యాపిలి : గర్భిణులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని ప్యాపిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ తెలిపారు. బుధవారం ప్యాపిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా 72 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణి సమయంలో జాగ్రత్తలతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర గౌడ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు గంగాదేవి, ఆర్‌డిటి నరసింహులు గౌడ్, సిబ్బంది పద్మ, శశి కళ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. **అవుకు :** పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు సుష్మ, యమునాలు గర్భవతులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్న రక్త పరీక్షలు, మందులు అందజేశారు. ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ టి వినోద్ కుమార్, సిబ్బంది సహకారంతో గర్భిణులకు మధ్యాహ్న భోజనం ఉచిత సరఫరా చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సూపర్వైజర్ కమల్ సాహెబ్, పిహెచ్ఎన్ మల్లేశ్వరి, వేణుగోపాల రాజు, దానమ్మ, తెరిసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు కనీస వసతులు శూన్యం : రైతు సంఘం

పగిడ్యాల : మండల ప్రజలు కనీస వసతులకు నోచుకోవడంలేదని రైతుల సంఘం జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు అధికారులపై మండిపడ్డారు. బుధవారం మండలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయ గ్రామాల్లో తాగు నీరు, మరుదొడ్లు, డ్రైనేజీ కాల్వలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై కళారూపాలతో ఉద్యమం : పిఎన్ఎం

ఆత్మకూర్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కళారూపాలతో ఉద్యమించేందుకు ఈ నెల 14, 15, 16వ తేదీలలో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోయలకొండ నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు డి. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన కళాకారులకు పక్క గృహాలు, అంత్యోదయ బియ్యం కార్డ్స్, ఆర్‌టిసి బస్సుల్లో రాయితీ, ఉద్యోగాలల్లో కల్చరల్ కోట భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాకారుల పెన్షన్ పెరిగిన ధరలకు అనుగుణంగా రూ. 3 వేల నుండి 5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి శిక్షణలో నూతన కళా రూపాలను తయారు జేసి, ప్రభుత్వం అనుసరించే తీరును ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రజానాట్యమండలి కళాకారులపై ఉందని తెలిపారు. ఈ శిబిరంలో కళా కారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

11న ఆత్మకూరులో జాబ్ మేళా

కొత్తపల్లి : ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 11న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమ శివారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపల్లి మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని సూచించారు. జాబ్ మేళాలో సుమారు 15 జాతీయ కంపెనీల వారు పాల్గొంటారని, టెన్త్, ఇంటర్, ఐటిఐ డిప్లమా ఆపై చదివిన విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, 2 పాస్ ఫోటోలతో హాజరు కావాలన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

నంద్యాల అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాలలోని జార్జ్ రెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27వ తేదీల్లో ఏలూరులో జరిగే పిడిఎస్‌యు రాష్ట్ర 21వ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆది, జిల్లా ఉపాధ్యక్షులుగా గణేష్, సహాయ కార్యదర్శులుగా పవన్, కోశాధికారిగా సాయితో పాటు 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బిసి కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

శిరివెళ్ల : మండలంలోని కోటపాడు గ్రామంలో గల బిసి కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన కాలనీకి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల భిజేంద్ర రెడ్డి సహకారంతో మండల విద్యుత్ శాఖ ఏఈ ఆదేశాల మేరకు నూతన ట్రాన్స్ఫార్మర్, నూతన స్తంభాలు, కేబుల్ సౌకర్యం కల్పించామన్నారు.

పార్క్ పనులను పరిశీలించిన కమిషనర్

నంద్యాల కలెక్టరేట్ : వెంకటేశ్వరపురం దగ్గర ఫ్లైఓవర్ కింద నూతనంగా నిర్మిస్తున్న పార్క్ పనులను మునిసిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి, డిఇలతో కలిసి బుధవారం పరిశీలించారు. పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఆటో నగర్‌లో ఉన్న రాజీవ్ గృహ కల్పలో ఉన్న కుటుంబాలకు తాగునీటి సమస్య, మురుగు కాల్వల నిర్మాణం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు త్వరలోనే తీర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పేరాయిపల్లి విద్యార్థులు

ఆళ్లగడ్డ : మండలంలోని పేరాయిపల్లి జడ్పీహెచ్ స్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థులు ఎన్.ఎస్.మహబూబ్ బీ, తలారి తనుషాలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 11 నుంచి 13 వరకు ప్రకాశం జిల్లా చెవ్వుర్లో జరిగే బాల్ రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలలో పాల్గొంటున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి విద్యార్థినులను అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. సుండిపెంటలో మూడవరోజు గడపగడప మన ప్రభుత్వము కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సులేమాన్ సెంటర్, ఫైర్ స్టేషన్, పెద్ద మసీదు, సవారి లైను, లూథరన్ చర్చి కాంపౌండ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, విద్యుత్ సమస్య, ఇంటింటికి కులాయి ఇచ్చే ప్రయత్నంలో ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ బి.రవీంద్రారెడ్డి, తహశీల్దార్ రాజేంద్ర సింగ్, ఎంపిడిఒ మోహన్ కుమార్, వైసిపి నాయకులు భరత్ రెడ్డి, వట్టి వెంకటరెడ్డి, ప్రవీణ్ తేజ, గుండయ్య యాదవ్, లింగాల గట్టు మత్స్యకారులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మండలంలోని కొణిదెల గ్రామంలో మూడోరోజు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. సర్పంచి కొంగర నవీన్, ఉప సర్పంచి భాస్కర్ రెడ్డి, నాగటూరు సర్పంచి చెవుల సుజాతమ్మ, తహశీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపిడిఒ శోభ రాణి, సింగిల్ విండో మాజీ చైర్మన్ చందమామ బాలస్వామి, సింగిల్ విండో చైర్మన్ ఉసేనయ్య, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన నంద్యాల విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్ మోహన్ రెడ్డితో కలిసి ఎనిమిదో వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల రూపంలో అందించారు. ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, సిఐ జీవన్ గంగనాథ్ బాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంగుల

స్కూల్ గేమ్స్ నియోజకవర్గ ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు బుధవారం ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి శ్రీశైలం నియోజవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆసియా మారుఫ్ ఆసియా హాజరై మాట్లాడారు. డిసెంబర్‌లో జూనియర్ ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్ జూనియర్ ఖోఖో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న అబ్దుల్ జుబేరుకు భువనేశ్వర్ రెడ్డి రూ. 5 వేలు ఆర్థికసహాయం అందజేశారు. సభాధ్యక్షులుగా పాఠశాల హెచ్ఎం సక్రు నాయక్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు జడ్పిటిసి శంకర్ రెడ్డి, కౌన్సిలర్లు విజయ చౌదరి, రషీద్, రంగస్వామి, సుల్తాన్, వైసిపి పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, జెడ్ శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, శ్రీశైలం నియోజకవర్గం స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం అందిస్తున్న భువనేశ్వర్ రెడ్డి

67 ఏళ్ల వయసులో కాలినడకన పుణ్యక్షేత్రాల దర్శనం

- నేటికీ 12,900 కిలోమీటర్లు పూర్తి

ప్రజాశక్తి - మహానంది

ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా నాలుగు అడుగుల దూరం వెళ్లాలన్న బైక్ లేదా ఆటోను ఆశ్రయిస్తున్న రోజులు. కానీ 67 ఏళ్ల వయసులో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 12,900 కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన పూర్తిచేసి అందరిని ఆకట్టుకున్నంటున్నారు మాజీ పోస్టుమాస్టార్ చంద్రశేఖర్. భారతదేశంలోని పలు రాష్ట్రాలలో వెలసిన జ్యోతిర్లింగ క్షేత్రాలను దర్శించుకుంటు శ్రీశైలం నుండి బుధవారం ఉదయం మహనందికి చేరుకున్న ఆయనకు పోస్టల్ శాఖ నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్‌పి ప్రసాద్ కలిసి స్వాగతం పలికారు.

వారి వెంట పోస్టల్ శ్యాఖ ఎంఒ గణేష్, శేషు, నాయక్, నరసింహ తదితరులు ఉన్నారు.

ఉపాధి నిర్వీర్యం కుట్రను తిప్పికొట్టాలి : వ్యకాసం

ప్రజాశక్తి - వెలుగోడు

కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పి కొట్టి, కాపాడుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, జిల్లా నాయకులు నరసింహ నాయక్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కే రామదాసు కోరారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నరసింహ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 25 వేల కోట్ల రూపాయలను బడ్జెట్లో నిధులను తగ్గించిందన్నారు. ఈ నెల 27, 28 తేదీలలో బేతంచెర్లలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వ్యకాసం మండల కమిటీ కన్వీనర్‌గా నూరుల్లా, కో కన్వీనర్లుగా సరస్వతి, లింగస్వామితో పాటు ఏడు మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - మహానంది

మహనంది మండలం బొల్లవరం గ్రామంలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. ఉదయం 8 గంటల సమయంలో వరి కోత మిషన్‌ను తరలిస్తున్న వాహనంపై విద్యుత్ స్తంభం పడింది. ఆ సమయంలో విద్యుత్తు లేకపోవడంతో డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమీపంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కూడా ఉంది. ఇది కూడా కింద పడి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గ్రామంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

విధుల పట్ల మైనర్ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

మైనర్ ఇరిగేషన్ అధికారులు విధులకు సక్రమంగా హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని బిజెపి ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయం వద్దకు బిజెపి మండల అద్యక్షులు బచ్చు శరత్ చంద్ర కుమార్ అధ్వర్యంలో మండలంలోని కుక్కలగంటి చెరువుకు ఏర్పడిన ప్రమాదంపై అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్ళారు. అక్కడ అధికారులు లేకపోవడంతో తలుపుకు వినతిపత్రం ఇచ్చి బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కుక్కలగంటి చెరువుకు గండిపడి నీరు వధాగా పోతుందని, నీరు ఇలాగే లీకేజ్ అయితే కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పొంచి ఉన్న ప్రమాదాన్ని అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జననీ మహిళా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కోవెలకుంట్ల : శాంతిరాం మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ సహకారంతో జననీ మహిళా బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం చెవి, ముక్కు, గొంతు, కంటి పరీక్షల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యమునా రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జమాల్ బీలు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిళా బ్యాంక్ అధ్యక్షులు సుజాత, పద్మావతమ్మ, కోశాధికారి హరి ప్రియ, సిఈవో రమణ, సావిత్రి, రత్నమ్మ వసంత, పద్మావతి, మార్కెటింగ్ ఇన్చార్జిలు కిషోర్ బాబు, వైవి రమణ, జిలాని బాబు, సీతారామయ్య, సుబ్రహ్మణ్యం, ప్రసాదు, పవన్ కుమార్ ,సురేష్ పాల్గొన్నారు.

శౌచాలయ నిర్మాణానికి భూమిపూజ

మహానంది : మహానంది క్షేత్ర అభివృద్ధిలో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి అభ్యర్ధన మేరకు జెఎస్‌డబ్ల్యు సిమెంట్ కంపెనీ వారు రూ.27 లక్షల వ్యయంతో భక్తుల సౌకర్యార్థం శౌచాలయాల నిర్మాణానికి బుధవారం ప్లాంట్ హెడ్ హుకుంచంద్ గుప్తా భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఇఇ చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఏఈఓ మధు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జెఎస్‌డబ్ల్యు అసిస్టెంట్ ఆఫీసర్ భాస్కర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండి ఆరోగ్యంగా ఉండాలి

బండి ఆత్మకూర్ : ప్రాథమిక పాఠశాల విద్యార్థి దశ నుండే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండాలని ఎంపిడిసిడి అండ్ ఆర్‌బిఎస్ఆర్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని అయ్యవారి కోడూరు గ్రామంలో ఉన్న ప్రత్యేక స్కూల్‌లో 50 మంది విద్యార్థినీ విద్యార్థులను పరీక్షించి వారికి తగిన వైద్యం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని నిత్య అన్నదాన పథకానికి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి లక్ష రూపాయలు విరాళంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్నకు బుధవారం అందజేశారు. ఇందులో కుమార్తెలు కేతిరెడ్డి వేమా మానస పేరు మీద రూ. 50 వేలు, కేతిరెడ్డి భావన పేరు మీద రూ.50 వేలు అందజేశారు. వీరికి శేష వస్త్రాలను, ప్రసాదాలను, సంబంధిత పత్రాలను దేవస్థానం అధికారులు అందజేశారు.

మహిళపై యువకుల దాడి

నంద్యాల కలెక్టరేట్ : ఎస్బిఐ కాలనీలోని భవనాసి వెంచర్ల కాపలదారులుగా ఉన్న మహిళపై యువకులు దాడి చేసి గాయపరిచినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ప్రభాకర్ రెడ్డి బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం అర్ధరాత్రి భవనాసి వెంచర్ వద్ద కొందరు యువకులు మద్యం సేవిస్తూ ఉండడాన్ని గమనించిన మోత్కూరు ఓబులమ్మ వారిని మందలించారు. మాట మాట పెరిగి మహిలపై దాడి చేసినట్లు సిఐ ప్రభాకర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

నందికొట్కూరు : నందికొట్కూరు మండలంలో మద్యం కేసులో పట్టుబడిన వాహనాలకు బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ శృతి ఆధ్వర్యంలో వేలం వేశారు. 110 వాహనాలను అధికారుల సమక్షంలో వేలం నిర్వహించగా 200 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. బైకులు 200, ఆటోలు 8, కార్లు 5కు వేలం వేశారు. మొత్తం వాహనాలను వేలం వేయగా రూ.10 లక్షలు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులను ఎంఇఒ పరిశీలన

కొలిమిగుండ్ల : మండలంలోని అబ్దుల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఎంఇఒ జిలాని భాష పరిశీలించారు. మూడు తరగతి గదుల పనులు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 74 లక్షలు మంజూరయినట్లు ఎంఇఒ తెలిపారు. ఎంఈఓ ఆఫీస్ అకౌంటెంట్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు

మిడుతూరు : మిడుతూరులోని సచివాలయం–2లో ఆధార్ కేంద్రంను బుధవారం ఎంపిడిఒ జివన్ రెడ్డి ప్రారంభించారు. ఆధార్ సేవలను పీర్ సాహెబ్ పేట గ్రామ ప్రజలు లలితమ్మ, కృష్ణ, బోయ మద్దిలేటి ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ రుసుముకే సేవలు వినియోగించుకుని సంతోషం వ్యక్తం చేశారు. పీర్ సాహెబ్ పేట గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ వినోద్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

అవుకు : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సంఘపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరుకట్టు ఐజాక్ అన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఐజాక్, గణిత ఉపాధ్యాయుడు శేఖరుడు కలిసి రూ. 5 వేలు విలువ గలిగిన 12 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను విద్యార్థులకు ఉచితంగా అందించారు.

IN THE COURT OF THE IIND ADDL. SENIOR CIVIL JUDGE :: NANDYAL ::
I.P. No. 13/2021

Neravati Sreedhar, …Petitioner

V/S

Byrika Sivareddy, & 8 others, …Respondents

R.2. Gandla Narayana aged 65 years, s/o Pedda Veeraiah, Hindu, Near Ramalayam ngo's, Colony, Nandyal Town, Kurnool. dist.

R.5. Konduru Padma raju aged 43 years, S/o , Buchi Lingamaiah, Hindu, opp. Vodaphone Office, Near Ramalayam ngo's Colony, Nandyal Town, Kurnool. dist.

R.7. Revuri Rama Krishna, aged 40 years, s/o Not known, Hindu, R/0,Attidi Solutions Office, Opp. Ramalayam ngo's Colony, Nandyal Town, Kurnool. dist.

R.8. Chellemala Subbarayudu aged 70 years, w/o Not known, Hindu, Chakali Bazar, viswanagar, Nandyal Town, Kurnool. dist.

NOTICE TO RESPONDENTS NO. 2, 5, 7 AND 8

Please take notice that the above I.P. filed by the petitioner against the respondents. The above case is posted to 21-11-2020 for your appearance.You should appear by 10:30 a.m. before IInd Addl. senior civil judge court Nandyal either in person or through Advocate, otherwise the matter will be decided in your absence.

(By court order)

వాయిదా తేది : 21-11-2022

A.SRINIVASA SHARMA,
Advocate for petitioner,
Nandyal.